విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

# 'జగనన్న సురక్ష సర్వే'పై అవగాహనకల్పించండి : కలెక్టర్

విశాలాంధ్ర-మచిలీపట్నం : గ్రామాలు, వార్డుల్లో పర్యటించి జగనన్నసురక్ష సర్వే వివరాలు తెలపాలని కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న సురక్షపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాలు వార్డుల్లో వలంటీర్ల సర్వే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఎలా జరుగుతుంది ప్రజల అభిప్రాయం ఏమిటి సాంకేతిక పరంగా ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాలను గమనించి నివేదిక అందజేయాలని ఎంపీడీవోలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ అధికారులు, మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. వాలంటీర్లు ఇంటింటికి తిరిగి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తిస్థాయిలో ఒకేసారి సర్వే చేయాలన్నారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు ప్రజల వద్ద అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకోవాలని ముందుగా ప్రచారం చేయాలన్నారు. వాలంటీర్లు సర్వే పూర్తికాగానే తక్షణమే సచివాలయంలో టోకెన్లు జనరేట్ చేయడంతో పాటు సేవల అభ్యర్థనలను నమోదు చేయాలన్నారు. ప్రజలకు కావలసిన వివిధ రకాల ధృవపత్రాల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థనలను సజావుగా విచారించుకొని తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు ఎన్ని ధ్రువపత్రాలు కావాలో అన్నింటికీ వేరువేరుగా దరఖాస్తులు పెట్టాల్సి ఉంటుందన్నారు. వివిధ రకాల సేవలకు చెందిన ఎన్ని ధ్రువపత్రాలు అవసరము ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో డి ఎల్డిఓ సుబ్బారావు ఆర్డీవోలు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## 30న ధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు పెంచిన కారణంగా ఈనెల 30వ తేదీన మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు పిలుపునిచ్చారు. ఆయన తన సహచరులతో కలసి బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏనుగు శ్రీనివాసరావు, అనిల్, వేణు, పాండురంగారావు, నాగరాజు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పాలకు ఘన నివాళులు

విశాలాంధ్ర-కూచిపూడి : డిసీసీబీ మాజీ చైర్మన్, అధికార పార్టీ నేత ఎస్ ఆర్ డీ గా ఈ ప్రాంతానికి సుపరిచితులైన ఉప్పాల రాంప్రసాద్ మృతి పార్టీకే కాకుండా, ఈ ప్రాంతానికి కూడా తీరనిలోటని జడ్పీటిసి రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర నివాళుల ర్పించారు. మొవ్వ మండలంలోని కూచిపూడి సెంటర్లో బుధవారం నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చిమటా రాఘవేంద్రరావు, రాజులపాటి మురళి, తాతా శేషుబాబు, మురారి కన్నయ్య, తాతా రామదాసు, వాకా బాలకృష్ణ, అయినంపూడి శివరామ కృష్ణ ప్రసాద్, కొండేటి చందు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి సంతాపం వ్యక్తం చేశారు.

## నేడు కిడ్నీ డయాలసిస్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి లోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో గురువారం కిడ్నీ ఉచిత డయాలసిస్ సెంటర్ను ప్రారంభిస్తున్నట్లు ఆ వైద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్ బుధవారం తెలిపారు. ఆయన వైద్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డయాలసిస్ పరికరాలు రెండింటిని రూ.70 లక్షలతో ఏర్పాటు చేశామని సాయి సౌఖ్యం సహకారంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేయనున్నట్లు వివరించారు. ఈ సెంటర్ ను డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఎం ఎన్ హరేంధర ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ప్రతినిధి రమణమూర్తి మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్ల ద్వారా హైదరాబాద్ (ఉప్పల్), కూచిపూడి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ స్ చేసే అవకాశం కలుగుతోందని, త్వరలో విజయనగరంలో కూడా ఏర్పాటు చేయగలమని పేర్కొన్నారు. విజయనగరంలో 100 పడకల క్యాన్సర్ ఆస్పత్రి కొనసాగుతోందని వివరించారు వీటితోపాటు ఈ కార్యక్రమంలో వైద్యాలయం పిఆర్ఓ కే పవన్ కుమార్ పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఆణిముత్యాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి ఓరియంటల్ హై స్కూల్ విద్యా విహార్లో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో పాసైన విద్యార్థులలో వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో "పెదముత్తేవిఆణిముత్యాలు"గా గుర్తించి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కొల్లా మాధవి, పూర్వపు ప్రధానోపాధ్యాయులు కోసూరు ఆదినారాయణ రావు, శ్రీకృష్ణాశ్రమ ప్రతినిధి ముత్తేవి గౌర కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌గా క్రీడాకారులు

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన 1వ రాష్ట్ర అంతర్ జిల్లాల బాలుర బాస్కెట్‌బాల్ పోటీలలో స్టేడియం చెందిన క్రీడాకారులు పాల్గొని విజయం సాధించడం అభినందనీయమని ఎన్టీఆర్ కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బోగ్గవరపు తిరపతయ్య, రాజీవ్‌కుమార్‌జీవావత్, దొప్పలపూడి రవికుమార్, చింతా రఘుబాబు, కోచ్ మల్లిఖార్జునరావు, మేనేజర్ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని కోసం 200 రోజుల ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అమరావతిపై ద్వేషంతోనే ఆర్-5 జోన్ తీసుకువచ్చి పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి జూలై 8న ఇళ్ళ నిర్మాణానికి శుకుస్థాపన అంటున్నారని,కేంద్రం రాష్ట్రవ్యాప్తంగా 47 వేల ఇళ్ళ నిర్మాణం చేయటానికి అనుమతి ఇస్తే ఈ ప్రభుత్వం ఆఆ జిల్లాలకు కేటాయించిన వాటిని మొత్తం రద్దు చేసి గుత్తగా అమరావతిలోనే మొత్తం ఇళ్ళ నిర్మాణం చేస్తుందని అంటే జగన్‌మోహన్‌రెడ్డి కేవలం అమరావతిపై ఉన్నకక్షతోనే చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నాయకులు కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని కోసం 200 రోజుల ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నాం అన్నారు.ఆంధ్రుల ఆత్మగౌరవానికి అస్తిత్వానికి ఎన్టీఆర్ ప్రతీక అందుకే ఆయన స్ఫూర్తితో జులై 17న హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ నుంచి అమరావతిలో ప్రధాని శంకుస్థాపన ప్రాంతం వరకు పాదయాత్ర చేపడుతున్నాం అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. రెండో దశలో మంగళగిరి, తాడికొండ ప్రాంతాలలో గడపగడపకు అమరావతి కార్యక్రమం చేపడతామన్నారు. బెంగళూర్, చెన్నై, హైద్రాబాద్ లకు ఆ రాష్ట్రాల యువత ఉపాధి అవకాశాలు కోసం వస్తారు అలాగే అమరావతిని పెట్టుబడుల కేంద్రంగా,ఉపాధికి కేంద్రంగా నిర్మాణం చేస్తేనే మన యువతకు అవకాశాలు కలుగుతాయి అందుకోసం అయినా మనకు అమరావతి లాంటి రాజధాని నిర్మాణం చేపట్టాలన్నారు.

# రేపు సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : కరెంటు బిల్లులతో ప్రజలకు షాక్ ఇస్తున్న జగన్ ప్రభుత్వమని ప్రజలపై పెనుభారంగా ఉన్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జీ కార్యదర్శి టీ.తాతయ్య డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి, ఏఐటీయూసీ తాడిగడప అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తాడిగడప సెంటర్‌లో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదిన కృష్ణా జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్ దగ్గర వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు ధర్నాలను జయప్రదం చేయాలి పిలుపునిచ్చారు. కరెంటు వైర్లు తాకితే ప్రజల షాక్ కొట్టిద్దని తెలుసు, జగన్ ప్రభుత్వంలో కరెంటు బిల్లులు పట్టుకుంటేనే షాక్ తగులుతుందని ఎద్దేవ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించు కోవాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డిప్రభుత్వంలో నాలుగు సంవత్సరాల కాలంలో కరెంటు చార్జీలు ఏడు దపాలుగా పెంచి 50 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేశారన్నారు. 2014 నుండి 19 వరకు వినియోగదారులు వాడుకున్న కరెంటుపై అదనపు పన్నుల భారాన్ని వసూలు చేయటం దుర్మార్గం అన్నారు. ఆరు రకాల పద్ధతుల్లో వినియోగదారులపై పన్నులు భారాన్ని వేస్తున్నారన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా గతంలో కమ్యూనిస్టులు చేపట్టిన విద్యుత్ ఉద్యమానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉద్యమ భాగస్వాములు అయ్యారని గుర్తు చేశారు. పెనమలూరు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కేంద్రంతో కుమ్మక్కై ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాలను మోపటం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు ఒక్కోమీటర్ రూ 7000 పడుతుందని, అదనపు రేటుతో రూ.13వేలకు షిరిడి సాయి ఎలక్ట్రికల్స్‌కు స్మార్ట్ మీటర్లు కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని, దీని ఫలితంగా ప్రతి నెలా భారం పడుతూ, పది సంవత్సరాలపాటు వసూళ్లు చేయటానికి పూనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలను ప్రజలందరూ త్రిప్పి కొట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్వహించేపోరాటాలకు విద్యుత్ ఛార్జీలు పెంచే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిగడప ఆటో వర్క్ సీరియల్ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు జ్యోతి బాబు, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : రూరల్ మండలంలోని మల్లయ్యపాలెం జగనన్న హౌసింగ్ లే-ఔట్‌లను కృష్ణాజిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ గోర్జి సూర్యనారాయణ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు టార్గెట్ పూర్తి చేసే విధంగా ఇప్పటికే రూఫ్ లెవెల్ వేసిన లబ్ధిదారులు త్వరితగతిన సెంట్రింగ్ పెట్టి స్లాబ్ వేసేవిధంగా అధికారులను చర్యలు తీసుకోవలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రామోజీనాయక్, హౌసింగ్ అర్బన్ ఎఇ సుబ్బారావు, బ్లాక్ ఇన్‌చార్జిలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పీవీ నరసింహారావు జీవితం ఆదర్శం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గొప్ప రాజనీతిజ్ఞుడు మాజీ మన ఎకైక తెలుగు ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జీవిత ఆశయాన్ని, స్ఫూర్తిని నేటి రాజకీయ నాయకులు, నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం పీవీ నరసింహారావు 102 వ జయంతి సందర్భంగా స్థానిక ప్రధాన పార్క్ పక్కన గల పివి విగ్రహానికి పూల ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా రంగంలో సంస్కరణలకు ఆద్యుడిగా, మానవీయ ముఖం గల ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా స్వర్గీయ పీవీ నరసింహారావు, ఈనాటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య) మాట్లాడుతూ స్వర్గీయ పీవీ నరసింహారావు మన తెలుగు ప్రధానమంత్రి గా దేశానికి చేసిన సేవలు ఎన్నో రకాలుగా ఉన్నాయని అవన్నీ కూడా నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ధనవంతరి ఆచార్య, తెలుగుదేశం పార్టీ కార్పోరేటర్లు, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత, తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,గొర్రెపాటి గోపీచంద్, గుమ్మడి విద్యాసాగర్, మాదివాడ వెంకట నరసింహారావు, పుప్పాల ప్రసాద్, రాజులపాటి నాగబాబు, కర్రెడ్ల సుశీల, బ్రాహ్మణ సంఘం నాయకులు, వి రామకృష్ణారావు, ఏ ఆర్ కె మూర్తి, వింజమూరి శివరాం, పి.వి ఫణి కుమార్, బీసీ సంఘ నాయకుడు కే వి వి సత్యనారాయణ పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్రంలో వైసీపీ పాలన రాకముందు ప్రభుత్వ పాఠశాలు పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత వాటి రూపురేఖలు మార్చటంతో కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయని ప్రవేశాలు పెరిగాయని పేద విద్యార్థులు చదువులు మధ్య లోనే ఆపకుండా ప్రతి తల్లి ఎకౌంటు కి అమ్మ ఒడి పేరుతో పైకము అందిస్తున్నారని అది తల్లులకి జగనన్న బడి గా మారిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు.బుధవారం పామర్రు ప్రైవేటు కళ్యాణ మంటపం లో అమ్మ ఒడి పంపిణీ కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యారంగాన్ని ప్రధమ స్థానంలో ఉంచారని జిల్లాలో 1,29,533 మంది తల్లులు ఖాతాలో రూ.194.30 కోట్లు జమ అవుతాయని దాని నమూన చెక్కు ను అధికారులు సమక్షంలో అందజేశారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగా యని విద్యార్థులకు డిజిటల్ విద్యా తో అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు అందజేస్తున్న ఘనత జగనన్నదే నని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ పేదరికం నుండి విద్యార్థులు బయట పడాలంటే చదువే ఏకైక మార్గం మని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.ఓ.తహేరా సుల్తానా ఉప విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు సర్పంచ్ కె.కస్తూరి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి యంపిపి దాసరి అశోక్ కుమార్ (పామర్రు) కాసాని వేద సుప్రజ (పమిడిముక్కల) కె.ఇందిర(మొవ్వ) జెడ్పీటీసీ కె.స్వరూప రాణి అధికారులు వైసీపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'భవిష్యత్తుకి గ్యారెంటీ' విజయవంతం చేయండి : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : జులై 3 నుండి పెడన పట్టణంలో జరగనున్న భవిష్యత్ కి గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం 14, 18, 11వ వార్డుల ముఖ్య నాయకులతో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కి గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ని వివరించి ప్రజల మద్దతు పొందడానికి మంచి అవకాశం అని అన్నారు. పెడన పట్టణంలో 3వ తేదీన ఉదయం 9 గంటలకు మఠం వీధీ లోని వినాయకుని గుడి వద్ద నుండి 4వ తేదీన సాయంత్రం 4 గంటలకు 18వ వార్డు రామరాజు కాలువ వద్దగల వినాయక గుడి వద్ద నుండి 5 వ తేదీన సాయంత్రం 4 గంటలకు 11 వ వార్డు శ్యామల నగర్ లో గల వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కార్యక్రమం నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో పెడన నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ మరియు ముఖ్య నేతలు పాల్గొంటారని వేణుగోపాల రావు తెలిపారు. ఈ సమావేశంలో పెడన పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, అనుముల పూర్ణచంద్రరావు, వేములవాడ జనార్ధన్, సేనా పతి అజయ్ కుమార్, కోరుమిల్లి వెంకటస్వామి, వంగపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళేశ్వర స్వామి సేవలో హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర-ఘంటసాల : శ్రీకాకుళం వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కాకులేశ్వర స్వామి వారిని హైకోర్టు జడ్జి ఎస్.సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు, రామానుజ చారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర్‌రావు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలం చౌటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 61.52 లక్షల అంచనా వ్యయంతో పైపులైన్ల నిర్మిణానికి వైసీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ ప్రారంభించారు. బుధవారం రూరల్ మండలంలోని చౌటపల్లిలోని పాత హరిజనవాడ, కొత్త హరిజనవాడ ప్రాంతాలలో నూతనంగా జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పిడబ్ల్యూఎస్ స్కీం ద్వార పైప్ లైన్‌నుల పనులకు ఎంపీపీ గద్దె పుష్పరాణితో కలసి వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్ పారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ అట్లూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లీశ్వరి, సర్పంచ్ వెలగలేటి రమ్య, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పరిపాలనలో ప్రజలు మార్పు కోరుతున్నారు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : ప్రజలు పరిపాలనలో మార్పు కోరుతున్నారని రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని పెడన తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం చినగొల్ల పాలెం దివిలో తెలుగుదేశం ప్రకటించిన మినీ మేనిఫెస్టో ప్రచారంలో భాగంగా భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలు కు తెలుగుదేశం పార్టీ ఇస్తున్న మేనిఫెస్టో హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తులసిరావు. కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, కూనసాని చిన్న, నాగిడి చెన్నకేశవరావు, నడకుదిటి ఆంజనేయులు, బెజవాడ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పనిచేయండి: ఎంపీపీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రజా సమస్యలపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీడీవో టీ. సీత మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ గోగం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ వ్యాధులు సోకకుండా అన్ని సచివాలయాల పరిధిలో పారిశుధ్యం, పరిశుభ్రత పాటించే విధంగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేయాలని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న జగనన్న సురక్ష లో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఆయా సచివాలయాల పరిధిలో అవసరం ఉన్న అర్జీలు పెట్టుకుని అధికారుల చేతుల మీదుగా ధ్రువపత్రాలను ఉచితంగా పొందే విధంగా సంబంధిత అధికారులు పనిచేయాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూరు శాతం రుణాలు వసూలు

విశాలాంధ్ర-ఘంటసాల: కేడీసిసి బ్యాంకులు నూరుశాతం రుణాలు వసూలు చేయడం అభినందనీయమని కేడీసీసీ కృష్ణాజిల్లా చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు పేర్కొన్నారు మండల పరిధిలోని కొత్తపల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ తాతినేని వెంకట కృష్ణారావు రుణాలు నూరు శాతం వసూలు చేయడంలో అహర్నిశలు కృషి చేసిన చైర్ పర్సన్ తాతనేని వెంకటకృష్ణారావుతో పాటు సెక్రెటరీ ఆదిలక్ష్మి మేనేజర్ పి వి శ్రీనివాసరావు కృష్ణాజిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు ప్రశంసా పత్రం జ్ఞాపికతో పాటు వారిని ఘనంగా శాలువాతో మచిలీపట్నంలో ఘనంగా సత్కరించారు. సూపర్వైజర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితురాలికి రెడ్ క్రాస్ చేయూత

విశాలాంధ్ర-చల్లపల్లి : పుచ్చగడ్డలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గొరిపర్తి వెంకటేశ్వరమ్మకు రెడ్‌క్రాస్ సంస్థ చేయూతను అందించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం బాధితురాలికి సాయం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా సంస్థ సహకారంతో వంటపాత్రల కిట్, టార్పాలిన్‌ను అందచేశారు. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు ఇడ్లీలు విక్రయించుకుని జీవిస్తున్న విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు జీవనోపాధికి అవసరమైన ఇడ్లీగిన్నె, బేసిన్, మినపగుళ్ళు, ఉప్పుడు రవ్వలను అందచేశారు. చల్లపల్లి తహసీల్దార్ కె.గోపాలకృష్ణ బాధితురాలికి సరుకులు, వంటపాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, వైస్ చైర్మన్ పేరం మధుసూధనరెడ్డి, ఆర్ఎస్ఐ బి.కిరణ్, వీఆర్వోలు అమలేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలనే ఆదాయ వనరుల మార్చుకున్న పశువైద్యాధికారులు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కొండపల్లి పశువుల వైద్యశాల వైద్యాధికారులకు, మూగజీవాలే ఆదాయ వనరులుగా మారాయి. పశుపోషకులకు పశువుల పోషణ భారమై, పశువులని పోషించలేని దశలో, పశుపోషకులు పశువులపై రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయించగా, పశువులను పరిశీలించి బ్యాంకులకు సర్టిఫై చేయవలసిన బాధ్యతలను పశు వైద్యాధికారిపై పెట్టాయి. ఇదే అదునుగా భావించిన పశు వైద్యాధికారి పశుపోషకుల నుండి అందిన కాడికి దోచుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై పశు వైద్యాధికారి మాత్రం బహిరంగంగా, బాహాటంగానే డబ్బులు మేము తీసుకుంటాం అని చెప్పడం గమనార్హం. కొద్దో గొప్పో రుణాల కోసం, బతుకు జీవుడా అంటూ వీరి వద్దకు వస్తే పశు పోషకులను సైతం, ఎటువంటి కనికరం లేకుండా పీడుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై గతంలో అనేకసార్లు స్థానికులు ఏడి, డిడి స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు కూడా బుట్ట దాఖలా చేశారు. వసూలు చేసిన మొత్తంలో కిందిస్థాయి వైద్యాధికారి నుండి అన్ని స్థాయిల అధికారులకు డబ్బులు పంపకాలు జరుగుతున్నాయని బోగట్టా. ఇప్పటికైనా వైద్యాధికారుల ఈ అక్రమ దందాపై జిల్లాస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ విచారణ చేసి, మెమో జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## తోపుడు బండ్లు, అన్నదానం పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్ఆర్ఐ గొలగాని రవికృష్ణ ఆధ్వర్యంలో గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద మహిళాలకు తోపుడు బండ్లు, అన్నదానం పంపిణీ చేశారు. బుధవారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో రవికృష్ణ తల్లి గొలగాని లక్ష్మీ దుర్గాంబ 82వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సీపీఐ మాజీ కార్పొరేటర్ పల్లా దుర్గమ్మ, 52వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఉమ్మడి చంటి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్డూరి శ్రీరామ్‌లు హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొలగాని రవి కృష్ణ విదేశాల్లో ఉంటూ విజయవాడలోని అనేక సేవా కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తన తల్లి దండ్రుల పేరు మీద వారి తల్లి గారి జయంతి పేదవారికి రెండు తోపుడు బళ్లను ఇవ్వటమే కాకుండా 200 మందికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించరన్నారని, కరోనా కష్టకాలంలో కూడా ఎంతో సేవలందించరన్నారు. ప్రైవేటు స్కూలులో పనిచేసే ఉపాధ్యాయులకు, సినిమా థియేటర్లో పనిచేసే సినీ కార్మికులకు అలాగే శానిటరీ, పోలీస్ సిబ్బందికి ఎంతోమందికి నిత్యావసర సరుకులు తో పాటు కూరగాయలు దస్తులు పంపిణీ చేయడం చాలా ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భోగావల్లి శ్రీధర్, పొట్నూరి చక్రధర్, దుక్కా వేణు, బిసి సంఘం నాయకులు నమ్మి అప్పారావు, నమ్మి భాను, యాదవ కళ్యాణ మండపం సెక్రటరీ మురిపాల దుర్గారావు, దేవర సురేష్, బొట్ట నాగేంద్ర, బొట్ట అర్జున్, ఆవాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## త్రీడి ప్రింటింగ్ టెక్నాలజిదే భవిష్యత్తు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ రంగంలో వెల్లువెత్తుతున్న ఉపాధి అవకాశాలను పాలిటెక్నిక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. సాంకేతిక విద్యా శాఖ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్- విశాఖపట్నం) సహకారంతో బుధవారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అధ్యాపకులు, విద్యార్థుల కోసం త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై వెబినార్‌ను నిర్వహించారు. పరిశ్రమ నిపుణులచే సమన్వయంతో నిర్వహించే వెబినార్లు పరిశ్రమలు అనుసరిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై ఖచ్చితమైన అవగాహన కలిగిస్తాయని నాగరాణి అన్నారు. సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన ప్రింటెలిటిక్స్ - బెంగుళూర్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ అభిషేక్ శాస్త్రి మాట్లాడుతూ త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ విభిన్న రంగాలలో కీలక పాత్రను పోషిస్తుందన్నారు. సిఇఎంఎస్ సిఇఓ సేతు మాధవన్, సిటిఓ గోపికృష్ణ మాట్లాడుతూ తయారీ, మౌలిక సదుపాయాలు, మేరీటైమ్ రంగాలలో నైపుణ్యాభివృద్ధి పరంగా సిఇఎంఎస్ పాత్రను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 55 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుండి 1,432 మంది విద్యార్థులు, 264 మంది మెకానికల్ , ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు ఈ వెబ్‌నార్ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనకు చదువే మార్గదర్శకం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : పేదరిక నిర్మూలనకు చదువే మార్గదర్శకమని రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకంలో భాగంగా బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గ్రామం నుండి అమ్మఒడి నాలుగో విడత నగదును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి బుధవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, ఎమ్మెల్యేలు ఎం.విష్ణువర్ధన్, వీ.శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, ఆవుతూ శ్రీశైలజారెడ్డి పాల్గొని అమ్మఒడి పథకం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 70 వేల 587 మంది తల్లులకు రూ.255 కోట్ల 88 లక్షల 5 వేలు అమ్మఒడి పథకంలో నాలుగో విడతగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 31 నుండి జూలై 7వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### బీఎస్సీ చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సెస్‌గా అవకాశం

బీఎస్‌సీ నర్సింగ్ కోర్స్ పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సెస్‌గా అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపిఎస్ఎస్‌డీసీ)-టీపీకేటీ ఇంటర్నేషనల్-ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సెస్‌గా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు 20 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి కనీసం 2 సంవత్సరాలు సాధారణ ఆసుపత్రుల్లో పని చేసిన అనుభవం ఉండాలన్నారు. జర్మన్ భాష నేర్చుకునేందుకు ఆసక్తి, అక్కడ పనిచేయటానికి సిద్ధంగా ఉండాలన్నారు. అభ్యర్థులకు జర్మనీ ప్రయాణానికి విమాన చార్జీలు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. మొదటి 6 నెలల పాటు ఆహారం, వసతి ఉచితమని, నెలకు వేతనం వెయ్యి యూరోలు భారతీయ కరెన్సీ రూ.89వేలని, అనంతరం ఆరు నెలల పాటు జర్మనీలో బి2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారన్నారు. బి2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు దాదాపు 2,500 యూరోల వేతనం పొందవచ్చని చెప్పారు. ఈ నెల 30 తేది రిజిస్ట్రేషన్‌కు చివరి తేది అని www.apssdc.in/home/onlineprogramregistration ఆసక్తిగల అభ్యర్థుల సర్టిఫికేట్స్, రెజ్యూమ్‌ను helpline@apssdc.in మెయిల్ ఐడి లేదా కాల్ సెంటర్ 9988853335 నెంబరుకు పంపాలని తెలిపారు.

### యుపీఎస్‌సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

యుపీఎస్‌సీ ద్వారా నిర్వహించే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జూలై 2వ తేదీన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేది ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష, మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందితో వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని వైద్య శాఖాధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులను, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని వీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్‌వో కే.మోహన్‌కుమార్, ఆర్‌డీవో రవీంద్రరావు, వీఎంసీ అడిషనల్ కమీషనర్ శ్యామల, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణం వేగవంతం చేయాలి : ఆర్డీఓ

విశాలాంధ్ర-తిరువూరు: జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి ప్రసన్న లక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ సిబ్బందితో గృహనిర్మాణ ప్రగతి పైన, జులై 1 నుంచి జరుగనున్న జగనన్న సురక్ష కార్యక్రమం పైన సమావేశం నిర్వహించారు. పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులను ప్రోత్సహించి త్వరగా ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలని ఆర్డీవో సూచించారు. పట్టణంలోని పీటీ కొత్తూరు జగనన్న కాలనీలో నూరు శాతం ఇల్లు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్, నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విధి విధానాలను ఆర్డీవో వివరించారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, ఏ కొండూరు, విసన్నపేట మండలాల రెవిన్యూ, హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-తిరువూరు: వాహన చోదకులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సహాయ పోలీస్ కమిషనర్ రమేష్ సూచించారు. ఇటీవల తిరువూరు ప్రాంతంలో ద్విచక్ర వాహన చోధకులు అధిక సంఖ్యలో ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తూ పోలీసులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజుపేట అష్టలక్ష్మి ఆలయం సెంటర్లో ఈ ర్యాలీని ఏసిపి ప్రారంభించారు. తిరువూరు డివిజన్లోని పోలీస్ సిబ్బంది హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ బ్యానర్లు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ రోడ్ లోని అయ్యప్ప స్వామి గుడి వద్ద వాహన చోదకులకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఏసీబీ రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తిరువూరు సిఐ భీమరాజు, ఎస్ ఐ లు సతీష్, పద్మారావు సిబ్బంది పాల్గొన్నారు.

### హెచ్ఐవిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర- కంచికచర్ల: హెచ్ఐవి పై అవగాహన సదస్సును స్థానిక కంచి చర్ల సిటీ నందు కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ వారి ఆధ్వర్యంలో వాసవి మహిళా మండలి వారి హెచ్ఐవి వచ్చే మార్గాల గురించి హెచ్ఐవి ఎలా రాదు అనే విషయం గురించి అవగాహన చేస్తూ అలానే హెచ్ఐవి టెస్ట్ వల్ల ఉపయోగాలు గురించి మరియు సుఖ వ్యాధులు యొక్క లక్షణాల గురించి మరియు కండోమ్ యొక్క ఉపయోగం గురించి తెలిపారు. దీనికిగాను మొబైల్ ఐ సి టి సి కౌన్సిలర్ శివాజీ గారు మరియు యుగేందర్ మరియు కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ పిడిఎఫ్ షిబా మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

### చలసాని విద్యా ప్రగతి సేవా సంస్థ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విజయం సాధించిన విద్యార్థులకు (ప్రథమ, ద్వితీయ, తృతీయ) నగదు ప్రోత్సాహక బహుమతులను సీపీఐ 61వ డివిజన్ కార్యదర్శి కే రామరాజు అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఐ 60, 61వ డివిజన్ ఇన్చార్జ్, ప్రముఖ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ (చలసాని వెంకటరత్నం కుమారుడు) సహకారంతో విద్యార్థులకు చలసాని విద్యాప్రగతి ద్వారా నగదు బహుమతులను ఇచ్చారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ మా తండ్రి చలసాని వెంకటరత్నం నిరుపేదలకు అండగా కమ్యూనిస్టు పార్టీ భావాలతో ముందుకు వెళ్లారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉన్నత చదువుల్లో ముందుకు సాగాలని, రాష్ట్రంలోనే ప్రముఖ వ్యక్తిగా ఎదగాలని, తమ నివాస ప్రాంతానికి తల్లిదండ్రులకు, మంచి గుర్తింపు తేవాలని విద్యార్థులను కోరారు. వచ్చే సంవత్సరంలో పదో తరగతి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన వారికి లక్ష రూపాయలు నగదుగా బహుమతి, స్కూలు ఉపాధ్యాయులకు లక్ష రూపాయలు నగదుగా తలసాని విద్య ప్రగతి ద్వారా ఇస్తానని. ప్రకటించారు. అనంతరం స్కూల్ ప్రథమ విద్యార్థి బి సందీప్ కుమార్ 513 మార్క్స్ వచ్చి సాధించిన 10వేలు, పి పురుషోత్తం 503 మార్క్స్ సాధించిన విద్యార్థికి రూ.7500 నగదు, షేక్ ఖాదర్ వలీ 489 మార్క్స్ సాధించిన విద్యార్థికి రూ.5000 నగదును విద్యార్థుల తల్లిదండ్రుల స్కూలు ఉపాధ్యాయుల సమక్షంలో వారికి అందజేయడం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులు అజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం రవికుమార్, అజయ్, వెంకట్రావు, దుర్గాప్రసాద్, కార్తీక్, విద్యార్థుల పేరెంట్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెడపంగు ఐజాక్ వర్ధంతి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సీపీఐ 47వ డివిజన్ అధ్వర్యంలో టేనర్‌పేట ఏరియా మాజీ శాఖ కార్యదర్శి రేడపంగు ఐజాక్ 39 వర్ధంతి కార్యక్రమం టిఎంహెచ్ స్కూల్ వద్ద 47వ శాఖా కార్యదర్శి ఆర్ మైఖేల్ అధ్వర్యంలో ముఖ్య అతిథిగా నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐజాక్ ఉద్యోగం చేసుకుంటూనే, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణానికి, కొత్తపేటలో వాగు సెంటరు, చిట్టినగర్, టేనర్‌పేట, పాల ఫ్యాక్టరీ కొండ ప్రాంతాలలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం విశేషమైన సేవలను చేశారని కొనియాడుతూ, మనమంతా ఆయన స్ఫూర్తితో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్ యాకోబ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, నాయకురాలు రాణి, నగర కార్యవర్గ సభ్యులు డివి రమణబాబు, ఎస్ నాగేశ్వరరావు, ఎం సూరిబాబు, టి ఎలమంద, వి రామారావు, సామ్యూల్ ఫాస్టర్, కె సాగర్, ఆర్ ప్రభుదాస్, జి యేసు, ఐ రత్నశేఖర్, ఎస్ మోషే, ఆర్ కుమార్, ఆర్ విశ్రాంతమ్మ, ఆర్ జయభరతి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ లేకుండా పన్ను చెల్లించేందుకు 30 వరకే గడువు

### నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఈ ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించేవారు వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నందున పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులను సకాలంలో చెల్లించాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా 2 శాతం రాయితీతో పన్ను బకాయిలు చెల్లించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నగర పాలక సంస్థ అన్ని సర్కిల్ కార్యాలయాల్లోని అన్ని క్యాష్ కౌంటర్లు శెలవు రోజున కూడా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. కావున పన్ను చెల్లింపుదారులు అవకాశాన్ని సద్వినియోగించుకుని పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని సూచించారు.

### ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్ఓ

విశాలాంధ్ర-చందర్లపాడు : మండలంలోని చందర్లపాడు తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వడ్లమూడి వైకుంఠరావు (వాసు ) గ్రామానికి చెందిన రైతు వద్ద రూ.5 వేలు తీసుకుంటూ ఉండగా వ్యూహాత్మకంగా ప్రణాళికను సిద్ధం చేసుకున్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా వీఆర్ఓను పట్టుకొని లంచంగా తీసుకున్న రూ.5 వేలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది

### బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముస్లింలు జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనవి రెండు. ఒకటి ఈదుల్ ఫీతర్ (రంజాన్), రెండోది ఈద్-ఉల్-జుహా(బక్రీద్) బక్రీద్ త్యాగనిరతిని తెలియజేసే పండుగ. ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు, పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దానిని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీనేనే ఖుర్బానీ అంటారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన ఈద్గాలతో పాటు మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుండి ప్రత్యేక ప్రార్ధనలు ప్రారంభమవుతాయి. శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకునేందు జిల్లా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

### యువకుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): యువ కుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తిరువూరుకు చెందిన సందీప్(30) ఎనికేపాడులో ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ నగరంలో కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తన సోదరుడు సందీప్‌కు ఫోన్ చేస్తుంటే సమాధానం రాలేదు. దీంతో అనుమానం వచ్చిన అతని స్నేహితులను రూమ్ వద్ద పంపించాడు. అక్కడి వెళ్లి చూసేసరికి సందీప్ ఫ్యానుకు ఉరేసుకుని వెలాడుతున్నాడు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ పేదల సంక్షేమంపై లేదు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ పేదల సంక్షేమంపై లేదని ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు అన్నారు. తూర్పు నియోజక వర్గంలోని 6వ డివిజన్ నిమ్మతోట సెంటర్‌లో టీడీపీ అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్ళి వివరించారు.

అనంతరం నిమ్మితోట సెంటర్‌లో మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్‌నొక్కాలనే ఆర్భాటం, సాక్షి పత్రికకు ప్రకటనలు ఇవ్వాలనే ఉత్సాహం తప్ప పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సక్రంగా అందుతున్నాయో లేదో అనే అలోచన సీఎంకు లేదన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ సక్రమంగా విడుదల చేయకపోవటం వల్ల చాలా మంది ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాల ఆఫీస్ రూమ్‌లోని బీరువాల్లో ఉన్నాయన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్‌కు విద్యుత్ బిల్లుకు లింకు పెట్టి ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఎగ్గొడుతున్నారన్నారు. టీడీపీ విధివిదానాలు అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా స్పష్టంగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేలకు డిపాజిట్లు కూడా దక్కవని చంద్రబాబు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి ఆదరణ బాగుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన వితరణకు సహకరించిన పీ.గంగాధర్ టీడీపీ నాయకులు పీ.మోహనరావు, ఎస్.రాజా, ఎం.రామినాయుడు, ఏ.శ్రీనివాస్, కే.దుర్గారావు, షేక్ షకీలా, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

## తూము వేయటం మరిచారా..? లేదా చిన్నపిల్లల భద్రతను మరిచారా ?

విశాలాంధ్ర-వీరులపాడు: ప్రమాదం పొంచి ఉన్న పట్టించుకునే నాథుడే లేదని స్థానికులు వాపోతున్నారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో జుజ్జూరు గ్రామం నుండి చట్టన్నవరం గ్రామానికి వెళ్ళే గ్రావెల్ రోడ్డు కు ఆనుకొని వున్న అంగన్వాడి ప్రైమరీ స్కూల్-6 పక్కనే వరద నీరు వచ్చే కాలువ వుంది. అదే రహదారిని క్రాస్ చేస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి ఉంది, ఈ మధ్యకాలంలో హై స్కూల్ కి వెళ్లే దారి సిమెంట్ రోడ్డు వేయడంతో చట్టన్నవరం గ్రావెల్ రోడ్డు కి కనెక్టివిటీ కోసం కాలవకు తూములు వేయకుండా పూడ్చడంతో భారీ వర్షాలు పడితే పక్కనే ఉన్న స్కూలు దిగువకు వర్షపు నీరు చేరే అవకాశం ఉన్నది, ఆ ప్రదేశం బాగా లోతుగా ఉండటంతో స్కూలుకు వచ్చే చిన్న పిల్లలకు ఆ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఎటువంటి నష్టం జరగకుండానే ముందు చూపుతో అధికారులు ఆలోచించి తూములు వేసే ఏర్పాటు చేస్తే వర్షపు నీరు సక్రమంగా వెళ్లి ఎటువంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు.ఒక్కొక్కసారి కొన్ని పనులు తరువాత చేద్దాములే అనే అలసత్వం వేరొకరి పాలిట ప్రమాదంగా మారవచ్చు. తక్షణం చర్యలు తీసుకుంటే విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

### డిస్ట్రిక్ట్ లెవెల్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో విద్యార్థినులు



విశాలాంధ్ర-వీరులపాడు: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు కండక్ట్ చేసిన డిస్ట్రిక్ట్ లెవెల్ క్విజ్ పోటీలో వెల్లంకి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.సంతోషి, 9వ తరగతి చెందిన ఎస్.నవ్యలు ప్రథమ స్థానం సాధించినట్లు వెల్లంకి జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. వీరికి డీఈవో రేణుక చేతుల మీదగా ప్రథమ బహుమతిని విద్యార్థులకు అందించి 10000 రూపాయలు నగదును అందజేసినట్లు తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థినులను జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## దేవాలయ భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-నందిగామ : కొనతమాతుకూరు గ్రామానికి చెందిన భక్తాంజనేయ స్వామి వారి దేవాలయానికి చెందిన భూమిని కొందరు ఆక్రమణ చేసుకొని పశువుల మేత ద్వారా లాభాపేక్ష పొందుతూ దేవాలయానికి వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సదరు భూమిని సర్వే చేయించి దేవాలయానికి చెందిన భూమికి రక్షణ కల్పించాలని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బుధవారం ఆర్డీవోకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సదరు విషయంపై ఇప్పటికే గ్రామ పంచాయతీ అత్యవసర సమావేశంలో తీర్మానం నకలు చేయటం జరిగినట్లు అలాగే మండల రెవెన్యూ అధికారికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు సదరు వినతిపత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, గ్రామస్తులు వినయ్ కుమార్, చంద్రశేఖర రావు, బాలకోటయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## స్పర్శలేని మచ్చలను అశ్రద్ధ చేయొద్దు

విశాలాంధ్ర-తిరువూరు: చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేకుండా ఉన్న మచ్చలను అశ్రద్ధ చేయవద్దని తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం కృపారాణి అన్నారు. మండలంలోని గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది బుధవారం లెప్రసి వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో చేపట్టిన లెప్రసి సర్వే వేగవంతం చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సెక్రటరీ లు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి స్పర్శలేని మచ్చలు ఉన్నవారి వివరాలు నమోదు చేశారు. చర్మంపై ఎర్రని లేదా రాగిరంగు మచ్చలు, తిమ్మిర్లు, నొప్పి తెలియని గాయాలు, చర్మంపై బుడిపెలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని కృపారాణి సూచించారు. యూ పీ హెచ్ సీ హెల్త్ సూపర్ వైజర్ కే రవి, హెల్త్ విజిటర్ కే పద్మావతి పర్యవేక్షించారు.

## తిరుపతమ్మకు ఆషాడం సారె సమర్పణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజుల్లుతున్న పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాడమాస సారే సమర్పించేందుకు సిద్ధం చేసిన పూజా సామాగ్రి. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు అభివృద్ధి చెందాలని, తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో తిరుపతమ్మ అమ్మవారికి సారే సమర్పించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గ్రామంలోని మహిళా భక్తులందరూ బుధవారం సామూహికంగా సారే సమర్పించా రు. దానికి గాను నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలు, గాజులు, వివిధ రకాల పండ్ల తో ఏర్పాటుచేసిన సారెను పడమర బజార్ శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మండపం వద్ద నుండి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం వరకు తరలి వెళ్లి ఆలయ పూజా రు. వేద పండితులు, ఆలయ చైర్మన్ ఇంజం. కేశవరావు, ఈఓ. రమేష్ నాయుడు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా విభాగం నుండి సూరి, నల్లపునేని. జ్యోతి,మండల స మై ఖ్య అధ్యక్షురాలు. కాకాని. పద్మ, పూసల సంఘం డై రెక్టర్ చేని. కుమారి, విశ్వ బ్రాహ్మణ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు. కల్లూరి. వాణి, చాట్ల.రత్న కుమారి.అలాగే గ్రామం లోని అన్ని కులాలనుండి మహిళా భక్తులు పాల్గొన్నారు.

### రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నేతలకు ఘన సత్కారం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంటుపల్లి బ్రాంచి ట్రెజరర్ జి.కె.డి.ఆంజనేయులు, వైస్ చైర్మన్ ఎ.పి.రంగారావుల ఉద్యోగ విరమణను పురస్కరించుకుని వ్యాగన్ వర్క్ షాప్ సంఘ్ కార్యాలయ ఆవరణలో నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంఘ్ బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేస్తున్న ఆంజనేయులు, రంగారావు కార్మికులకు అందించిన సేవలు అమూల్యమైనవన్నారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ వర్క్ షాపు మేనేజర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయులు, రంగారావు లను నాయకులు ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో కార్మిక సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, బొండా ఉమామహేశ్వరరావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ, ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎస్ సీఆర్ఈ ఏజీఎస్ లు చరణ్ భాను ప్రసాద్, వై.ఎస్.బాబు, డీపీలు ఎ.రాఘవేంద్ర, ఎ.వెంకటేశ్వరరావు, సంఘ్ మాజీ అధ్యక్షుడు ఎస్.వి.సాంబశివరావు హాజరయ్యారు.

# పల్లెప్రజలకు చేరువలో ప్రభుత్వ పాలన

విశాలాంధ్ర-తిరువూరు: ప్రభుత్వ పాలన పల్లెప్రజలకు చేరువలో ఉండేందు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రారంభించినట్లు తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి అన్నారు. మండలంలోని జి కొత్తూరు శివారు చిక్కుళ్ళగూడెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రక్షణ నిధి నిర్వహించారు. గ్రామాల్లో సంక్షేమ పథకాల సక్రమ అమలుకు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, అర్హత ఉంది సంక్షేమ పథకాలు అందని కుటుంబాలు వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి, జడ్పిటిసి సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, సర్పంచ్ వెంకట రావమ్మ, పిఎసిఎస్ చైర్పర్సన్ కృష్ణారెడ్డి, విసన్నపేట జడ్పిటిసి సభ్యుడు లోకేష్ రెడ్డి, కాలసాని గోపాల్ నాగేశ్వరరావు, గోపి, ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పీవీ నరసింహారావు జయంతి

విశాలాంధ్ర-ఇబ్రహీం పట్నం : కొండపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి వేడుకలను, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ పాల్గొని వారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూ , పాములపర్తి వేంకట నరసింహారావు (పి వీ) తెలంగాణ లోని లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న జన్మించారాని. ఒక జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించి,కాకతీయ పత్రిక నడిపారని తెలియజేశారు. ఈ దేశ అభివృద్ధికి కృషి చేసిన పీవీ ని ఒక తెలుగువానిగా ప్రపంచ వ్యాప్తంగా కీర్తించబడిన వారిని ఇప్పటికి ఎప్పటికి మరువలేమన్నారు. ఈ కార్యక్రమం లో పోతురాజు ఏసుదాసు,డి.సి.సి ప్రధాన కార్యదర్శి అక్కల ప్రసాద్ ,పార్టీ నాయకులు రాగాల రాము,పోతురాజు థామస్ పాల్ ,కురాళ్ళ సాయిరాం, మంగళంపాటి లింగరాజ్, భూక్యా. రాము , బి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నవోదయకు ఎంపిక

విశాలాంధ్ర -అవనిగడ్డ : ఎం.పి.యు.పి స్కూల్ విద్యార్థిని నవోదయలో సీటు సాధించింది. మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలో ఎం.పి.యు.పి స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ఇంకొల్లు దివ్యశ్రీ తండ్రి బాబుచందర్, నవోదయ టెస్ట్‌కు పరీక్ష రాయగా 100 మార్కులకు గాను 85 మార్కులు సాధించి 6వ తరగతిలో చేరేందుకు నవోదయ స్కూల్‌లో సీటు సాధించిందని స్కూల్ ప్రధానోపాధ్యయులు ఆర్.రవికిరణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థి దివ్యశ్రీని అభినందించారు.

## అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ లో 30 కేజీలు పెద్ద కణితి తొలగింపు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : కానూరు విజయవాడ లోని అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ ఒక భారీ చికిత్స ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా వైద్య విధానంలో గణనీయమైన మైలు రాయిని సాధించింది. రెట్రోపెరిటోనియల్ లైపో సార్కోమా అనే సర్జరీడాక్టర్ విజయ్ కోడూరి సర్జికల్ ఆంకాలజిస్ట్ మరియు డాక్టర్ మృదుల తాటకూరి కన్సల్టెంట్ ఎనస్తీషియాలజిస్ట్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. శస్త్ర చికిత్స బృందం ద్వారా నిర్వహించబడిన ఈ లాపరోటమీ పెద్ద కోతతో కూడిన శస్త్ర చికిత్స ప్రక్రియగా తెలిపారు. రెట్రో పెరిటోనియల్ పరిమాణం నుండి విముక్తి పొందేందుకు కచ్చితమైన శస్త్ర చికిత్స పద్ధతుల ద్వారా కణితి విజయవంతంగా తొలగింపబడింద న్నారు. పునరావృతమయ్యే ప్రమాదం లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో రోగికి ప్రాధాన్యతనిస్తూ శస్త్ర చికిత్స నిర్వహించబడిందన్నారు.ఏఓఐ రీజనల్ సీ ఓ ఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి విశేషమైన ఫలితాలను సాధించడంలో సహకారం అనేది ఇలాంటి సందర్భాలలో చాలా అవసరమన్నారు. వివిధ వైద్య విభాగాల నుండి సమన్వయ ప్రయత్నం సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా మరియు మల్టీ డిసిప్లినరీ టీం యొక్క నైపుణ్యాన్ని ఉపయోగించుకొని మేము సాధ్యమైనంత ఉత్తమమైన ట్రీట్మెంట్ ఫలితాలను అందించడానికి ప్రయత్నిస్తామన్నారు.


### బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన PIRAMAL CAPITAL & HOUISING FINANCE,(Formerly known as Dewan Housing Finance Corporation Ltd) విజయవాడ బ్రాంచివారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు వద్దకు కృష్ణాజిల్లా, పెనమలూరు(మం), కానూరు గ్రామం, డోర్.నెం.15-17 కాపురస్తురాలు బొక్క శ్రీనివాసరావు గారి భార్య పద్మ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని డిటో గ్రామ కాపురస్తులు చెరుకునీడి వెంకట మస్తాన్ రావు గారి వద్ద నుండి ది.29-01-2022న విక్రయ దస్తావేజు నెం.1058/2022 యస్.ఆర్.ఓ. పటమట ద్వారా విక్రయం పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్తిపై ఋణంకొరకు నా క్లయింటును సంప్రదించియున్నారు. సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ రిజిష్టర్ వీలునామా నెం.22/2018 ది.17-01-2018 గల దస్తావేజు పోయినదని,దొరకలేదని చెప్పి సదరు చెరుకునీడి వెంకట మస్తాన్ రావుగారు సదరు పైవిక్రయ దస్తావేజు 1058/2022 రీత్యా రిజిష్టరుచేసిన దరిమిలా సంక్రమించిన ఆస్తిని సర్వహక్కులతో అనుభవించుచున్నాని చెప్పి నాక్లయింటును ఋణంకొరకు సంప్రదించియున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపై గాని, మంజూరుచేయు ఋణముపై గాని, పోయిన దస్తావేజుపై గాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియ జేయవలెనని గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరుచేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు:కృష్ణా డి॥, విజయవాడ రి.డి॥, పటమట సబ్.డి॥, పెనమలూరు(మం),ప్రస్తుతం వై.యస్.ఆర్.తాడిగడప మున్సిపాలిటీ ఏరియాలో చేరిన కానూరు గ్రామ రీ.సర్వే, నెం.164 దాఖలా స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.

1వ అయిటం:చ.గ.300.625లు స్థిరాస్తిలో చ.గ.33.4లు వై.యస్.ఆర్. తాడిగడప మున్సిపాలిటీ వారికి దఖలు పరచగా మిగిలిన చ.గ.269.915లు ఆస్తికి హద్దులు. తూర్పు:పంచాయితీ రోడ్డు, అ.41.3లు,దక్షిణం: చెరుకునీడి సాంబయ్య, ఆకుల సాంబశివరావుగారల ఆస్తి,అ.66లు,పడమర:ఇవులమండ సుబ్బారావు గారి ఆస్తి కొంత, 2వ అయిటం దాఖలా ఆస్తి కొంత,అ.42లు, ఉత్తరం:తాళ్ళ సారంగరావుగారు మరియు పసుపులేటి శ్రీనివాస రావు గారల ఆస్తి,అ.64లు.

2వ అయిటం: చ.గ.2.69 ల స్థిరాస్తికి హద్దులు.తూర్పు: 1వ అయిటం దాఖలాఆస్తి,అ.6లు, దక్షిణం:అవులమండ సుబ్బారావు గారి ఆస్తి, అ.3.10లు,పడమర:ఇతరులఆస్తి, అ.6లు, ఉత్తరం: పసుపులేటి శ్రీనివాసరావు గారిఆస్తి, అ.4.3లు. పై రెండు అయిటంల దాఖలా చ.గ.యీ హద్దుల మధ్య చ.గ.272.605లు ఖాళీ నివేశన స్థలము యావద్వి శిష్టములతో సహా.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ.సెల్: 9949533987
విజయవాడ, తేది: 28-06-2023